## క్లుప్తంగా

### భక్తిశ్రద్ధలతో తిరుప్పావడ సేవ



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాత గుంటూరు: నందివెలుగు రోడ్డులోని శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వేంకటాచల స్వామి దేవస్థానం 8వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ బూసిరెడ్డి మల్లేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో గురువారం అత్యంత వైభవంగా తిరుప్పావడ సేవ జరిపారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, అగ్నిధ్యానం, నిత్య హోమం, బలిహరణం, కుంభపూజ, చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, మహా పూర్ణాహుతి, హారతి అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు మండవ వెంకటేశ్వరరావు, ఎం. నాగేశ్వరరావు, కొత్తమాసు వేణుగోపాల్, కె. నరసింహారావు, కె. శ్రీనివాసరెడ్డి, సీహెచ్. రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు మెడికల్: ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్, కేర్‌వెల్ హాస్పిటల్ అధినేత డాక్టర్ షేక్ నాగూర్‌బాషా పుట్టిన రోజు సందర్భంగా శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మేనేజింగ్ డైరెక్టర్ షేక్ గౌస్‌బాషా తెలిపారు. స్థానిక గుంటూరువారితోట 7వ లైనులోని హాస్పిటల్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

### అంగన్‌వాడీ ఆయా పోస్టుకు దరఖాస్తుల స్వీకరణ

నెహ్రూనగర్: ప్రత్తిపాడు నియోజకవర్గంలోని ఏటుకూరు మెయిన్ అంగన్‌వాడీ సెంటర్‌లో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు అర్బన్ సీడీపీఓ కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. 21 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు, స్థానికంగా నివాసంతో పాటు 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని ఆమె పేర్కొన్నారు. అర్హులైన మహిళలు ఈ నెల 16వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తుల్ని ఐసీడీఎస్ ప్రాజెక్టు గుంటూరు అర్బన్ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

### భక్తిప్రపత్తులతో సహస్ర దీపాలంకరణ సేవ



ఆలయంలో దీపాలంకరణ

పాత గుంటూరు: ఆర్. అగ్రహారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో 27వ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ప్రాతఃకాల ఆరాధన, నిత్యార్చన, నిత్య హోమం, విశేష హోమం, బలిహరణం తదితర కార్యక్రమాల్ని వేద పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఆరాధన, సహస్ర దీపాలంకరణ సేవ తదితర పూజల్ని నిర్వహించారు. కార్యక్రమాల్ని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కన్నా లక్ష్మీనారాయణ, ఆలయ కార్యదర్శులు దాసరి భాస్కరరావు, పాతకోట బ్రాహ్మణయ్య నాయుడు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

### ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే విజయం తథ్యం




సమావేశంలో మాట్లాడుతున్న జీఎస్టీ జాయింట్ కమిషనర్ నాగ జ్యోతి

గుంటూరు ఎడ్యుకేషన్: ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేస్తే మహిళలు అన్నింటా విజయన్ని సాధించగలరని గుంటూరు జీఎస్టీ జాయింట్ కమిషనర్ డి.నాగజ్యోతి పేర్కొన్నారు. శ్రీనివాసరావుతోటలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) గుంటూరు శాఖ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మహిళా దినోత్సవ కార్యక్రమంలో నాగజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉన్నారని, భయం అనే మాటను మనసులో నుంచి తీసి వేస్తే ఉన్నత స్థాయికి వెళ్లగలరని అన్నారు. ఐసీఏఐ గుంటూరు శాఖ చైర్మన్ మద్ది రవితేజ మాట్లాడుతూ సీఏ విద్యలో విద్యార్థినుల శాతం ప్రతి యేటా పెరుగుతోందని, మహిళలకు ఇది ఎంతో అనుకూలమైన కోర్సు అని, వృత్తిపరంగా మంచి భవిష్యత్తు ఉంటుందని వివరించారు. కార్యదర్శి చింతా రఘునందన్, సీఏలు వంగల భార్గవి, భరద్వాజ్, నరేష్, మృత్యుంజయరావు, చేగు అశోక్, ఆడిటర్లు పాల్గొన్నారు.

# బలహీనవర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**ఎమ్మెల్యే ముస్తఫా**



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముస్తఫా

పట్నంబజారు: బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని, పేదల అభివృద్ధికి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజాదరణ నానాటికి పెరుగుతోందని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా చెప్పారు. నియోజకవర్గంలోని 50వ డివిజన్, శారదాకాలనీ ఎక్స్‌టెన్షన్, గోపాలకృష్ణ కాలనీ, రత్నపురి కాలనీల్లో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముస్తాఫా స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్ని ప్రజలకు వివరించారు. రత్నపురి కాలనీలో ప్రధాన మురుగు కాలువ అభివృద్ధి చేయాలని, వర్షాకాలంలో పెద్ద ఎత్తున మురుగు నీరు చేరడంతో ఇబ్బంది పడుతున్నామని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. కాలువల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంక్షేమ పథకాలకు అర్హులు ఎవరైనా వారికి వెంటనే అందేలా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది దరఖాస్తు చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజిల, తూర్పు నియోజకవర్గ మహిళ నేత నూరిఫాతిమా, డివిజన్ కన్వీనర్ చీదర్ల రాజేష్, పలు కార్పొరేషన్ డైరెక్టర్లు, వైఎస్సార్ సీపీ నేతలు మహబూబ్, ఆలా కిరణ్, కుమార్, మల్లిక, కొండమ్మ, విఠల్, లక్ష్మణ్, వెంకటేశ్వర్లు, భాగ్యమ్మ, రేణుక, త్రివేణి పాల్గొన్నారు.

**కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన**

నియోజకవర్గంలోని 50వ డివిజన్ మంగళదాస్‌నగర్ 1వ లైనులో రూ. కోటితో నిర్మించనున్న సామాజిక భవనానికి ఎమ్మెల్యే షేక్ మొహమ్మద్ ముస్తఫా గురువారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంచనా విలువలు పెంచి మూడంతస్తుల వరకు నిర్మించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, మహిళ నేత ఉమ, కార్పొరేటర్ పఠాన్ రిహానా పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం



అర్బన్ హెల్త్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ కావటి, ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా

నెహ్రూనగర్: రాష్ట్రంలో విద్య, వైద్యానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు పేర్కొన్నారు. నగరంలోని 57వ డివిజన్ మంగళదాస్‌నగర్‌లో, 3వ డివిజన్ ప్రగతీనగర్‌లో నూతనంగా నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను గురువారం ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫాతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 560 అర్బన్ హెల్త్ సెంటర్లను నిర్మిస్తోందన్నారు. ఇందులో గుంటూరు నగరంలో 16 చోట్ల హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో హెల్త్ సెంటర్ నిర్మాణానికి రూ.95 లక్షల నుంచి రూ.1 కోటి వరకు ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇప్పటికే నగరంలో ఉన్న 10 సెంటర్ల మరమ్మతుల నిమిత్తం ఒక్కోదానికి రూ. 10 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. హెల్త్ సెంటర్లలో వ్యాధి నిర్ధారణ పరీక్షలతో పాటు అవసరమైన వైద్యం అందిస్తారని ఆయన పేర్కొన్నారు. ఎమ్మెల్యే మొహమ్మద్ ముస్తఫా మాట్లాడుతూ ప్రగతీనగర్, మంగళదాస్‌నగర్‌లో ఆరోగ్య కేంద్రాల్ని నిర్మించడం స్థానికులకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. ఆరోగ్య కేంద్రాల్లో 10 బెడ్స్‌తో పాటు 38 రకాల రక్త పరీక్షలు నిర్వహిస్తారనివివరించారు.కార్యక్రమంలో డెప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీల, వైఎస్సార్ సీపీ నాయకులు నూరి ఫాతిమా, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్జీరంగా వర్సిటీతో హెచ్‌డీఎఫ్‌సీ ఒప్పందం



ఎంఓయూ పత్రాలను చూపుతున్న వీసీ విష్ణువర్ధన్‌రెడ్డి, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అధికారులు

గుంటూరు రూరల్: విశ్వవిద్యాలయం అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఎల్లపుడూ కృషిచేస్తుందని విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. గురువారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఈ ఒప్పందం వల్ల వ్యవసాయ ఉత్పత్తిదారులకు సాంకేతిక శిక్షణకు, విశ్వవిద్యాలయంలోని అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థుల శిక్షణకు, అగ్రి స్టార్టప్‌లకు ఆర్థిక సాయం చేసేందుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం ఒప్పంద పత్రాలను అందుకున్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, విస్తరణ సంచాలకులు డాక్టర్ విజయాభినందన, వ్యవసాయ ఇంజినీరింగ్ పీఠాధిపతి డాక్టర్ ఎ.మణి, విద్యార్థి కార్యకలాపాల పీఠాధిపతి డాక్టర్ పి.సాంబశివరావు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రీజనల్ రూరల్ సౌత్ హెడ్ శ్రీధర్, క్లస్టర్ హెడ్ రాజేంద్ర పాల్గొన్నారు.

# అనుమానాస్పదస్థితిలో గర్భిణి మృతి



నవ్య మృతదేహం వద్ద పంచనామా నిర్వహిస్తున్న పోలీసులు



మార్చురీ వద్ద ధర్నా చేస్తున్న మృతురాలి బంధువులు

**మార్చురీ వద్ద మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన**

పెదకాకాని/ గుంటూరు ఈస్ట్ : మూడు నెలల గర్భిణి అనుమానాస్పద మృతి గందరగోళం, నిరసనలకు దారి తీసింది. పెదకాకాని మండలం గడ్డిపాడుకు చెందిన వీరవనేని మహేష్‌కు, తుళ్లూరు మండలం అనంతవరానికి చెందిన నవ్యతో నాలుగు నెలల క్రితం వివాహం అయింది. ప్రస్తుతం నవ్య మూడు నెలల గర్భిణి. మహేష్ కుటుంబం సమీపంలోని ఆటోనగర్‌లో బైడింగ్ వర్క్ చేస్తూ జీవనం సాగిస్తోంది. మహేష్ దంపతులు ఎప్పటి మాదిరిగానే బుధవారం మధ్యాహ్నం ఆటోనగర్ నుంచి ఇంటికి వచ్చి భోజనం చేశారు. మహేష్ తల్లిదండ్రులకు భోజనం తీసుకు వెళ్లగా, కొంతసేపు నిద్రపోతానంటూ నవ్య ఇంటి వద్దనే ఆగిపోయింది. సాయంత్రం 4 గంటల సమయంలో మహేష్ మరదలు ఇంటికి వచ్చి గదిలో నిద్రిస్తున్న నవ్యను కేకలు వేసింది. ఎంతసేపటికీ పలకక పోవడంతో అనుమానం వచ్చి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి చెప్పింది. రెండు వైపులా తలుపులు వేసుకుని గడి పెట్టుకోవడంతో అనుమానం వచ్చి పగులగొట్ట చూడగా అప్పటికే నవ్య ఉరివేసుకుని వేలాడుతూ కనిపించింది. చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తీసుకు వెళ్లగా మరణించినట్లు వైద్యులు ధ్రువీకరణించారు. సమాచారం అందుకున్న నవ్య కుటుంబసభ్యులు, బంధువులు గడ్డిపాడు చేరుకున్నారు. భర్త మహేష్ నవ్యపై దాడి చేసి చంపేసి, ఉరి వేసుకుందని చిత్రీకరిస్తున్నారంటూ మృతురాలి తండ్రి శానం విజయేంద్రరావు పెదకాకాని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని రాత్రి గడ్డిపాడుకు తరలించారు. పెదకాకాని పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ బండారు సురేష్‌బాబు తెలిపారు.

**జీజీహెచ్ మార్చురీ వద్ద నిరసన**

తమ కుమార్తెను అల్లుడు హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడంటూ మృతురాలి తల్లిదండ్రులు గురువారం జీజీహెచ్ మార్చురీ ముందు ధర్నా చేశారు. కొత్తపేట ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరెడ్డి ఘటనా స్థలానికి వచ్చి ధర్నా చేస్తున్న వారితో మాట్లాడారు. మహేష్‌ను ఇప్పటికే పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, కఠిన శిక్ష పడేలా చేస్తామని చెప్పి ధర్నా విరమింప చేయించారు. పోస్టుమార్టం అనంతరం వైద్యులు నవ్య మృతదేహాన్ని తల్లిదండ్రులకు అప్పగించడంతో వివాదం సద్దు మణిగింది.

### మొబైల్ పొల్యూషన్ వాహనాల తనిఖీ



తనిఖీలు నిర్వహిస్తున్న ఎంవీఐ గోపాల్

పట్నంబజారు: జిల్లాలో గురువారం రవాణా శాఖ అధికారులు మొబైల్ పొల్యూషన్ వాహనాల్ని తనిఖీ చేశారు. ధ్రువీకరణ పత్రాలు, వాహన స్థితిగతుల్ని క్షుణ్ణంగా పరిశీలించారు. నిబంధనలు పాటించని పలు వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఇందులో భాగంగా నాన్ ప్రొడక్షన్ ఆఫ్ రికార్డ్స్‌కు సంబంధించి ఎనిమిది, డ్రైవింగ్ లైసెన్సు లేనివి మూడు, రాంగ్ పార్కింగ్‌లో ఉన్న ఒక వాహనంపై కేసులు నమోదు చేశారు. ప్రజల నుంచి అధిక మొత్తంలో వసూలు చేయవద్దని సూచించారు. పొల్యూషన్‌కు సంబంధించి వాహన యజమానులకు తగిన రశీదు ఇవ్వాలని చెప్పారు. తనిఖీల్లో మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్లు గోపాల్ పాల్గొన్నారు.

### వ్యభిచార గృహంపై దాడి

గుంటూరు ఈస్ట్: వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. అరండల్‌పేట 1వ లైనులోని ఓ హోటల్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు గురువారం దాడి చేశారు. వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. ముగ్గురు మహిళలను రెస్క్యూ హోంకు తరలించారు.

# మోసం చేసి వివాహం చేసుకున్న వ్యక్తిపై కేసు

గుంటూరు ఈస్ట్: ఓ వ్యక్తి వివాహమైన విషయం చెప్పకుండా మరో వివాహం చేసుకుని మహిళను మోసం చేసిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. రాజీవ్‌గాంధీనగర్‌లో నివసించే పేరం ఎస్తేరు, క్రాంతిరాజును వివాహం చేసుకుంది. కొంతకాలం కాపురం చేసిన తరువాత అతడికి అంతకుముందే వివాహమై ఇద్దరు సంతానం ఉన్నట్లు తెలుసుకుంది. మొదటి వివాహమని చెప్పి క్రాంతిరాజు మోసం చేసినట్టు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**రియల్ సంస్థపై కేసు నమోదు**

ప్లాట్లు రిజిస్టర్ చేయకుండా మోసం చేసిన సంస్థపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గుంటూరుకు చెందిన శ్యాంసన్‌బాబు చిలకలూరిపేట కావూరు సమీపంలో, అరండల్‌పేట 1వ లైనులోని సాయికృష్ణ టౌన్‌షిప్ వేసిన వెంచర్‌లో ఓ ప్లాటు కొనుగోలు చేశారు. అందుకుగాను రూ. 2.91 లక్షలు చెల్లించారు. ఆయనతో పాటు మరో ఆరుగురు ఇదే విధంగా చెల్లించారు. టౌన్‌షిప్ నిర్వాహకులు వారి వద్ద డబ్బులు తీసుకుని ప్లాట్లు రిజిస్టర్ చేయలేదు. బాధితులు ఇటీవల వెంచర్ వద్దకు వెళ్లి చూడగా ఇతరులు కొనుగోలు చేసినట్లు తెలిసింది. తాము మోసపోయినట్లు గుర్తించి గురువారం శ్యాంసన్‌బాబు, మరికొంత మంది పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

**వ్యక్తి ఆత్మహత్యాయత్నం**

పట్నంబజారు: కుటుంబ కలహాల నేపథ్యంలో వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. నగరంపాలెం పోలీసులు, దిశపీఎస్ సీఐ నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... రెంటచింతల మండలం పాలవ్వాయికి చెందిన దేరంగుల రమేష్‌కు 15 సంవత్సరాల క్రితం గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీకి చెందిన తిరుపతమ్మతో వివాహం జరిగింది. వీరికి ఇరువురు సంతానం ఉన్నారు. ఈ క్రమంలో చెడు వ్యసనాలకు బానిసైన రమేష్ మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. దీనిపై భార్యాభర్తల మధ్య వివాదం జరుగుతుండటంతో తిరుపతమ్మ కృష్ణబాబు కాలనీలోని పుట్టింటికి వచ్చింది. గురువారం అక్కడ వచ్చిన రమేష్ ఆమెతో ఘర్షణ పడ్డాడు. ఈ క్రమంలో తిరుపతమ్మ దిశ పోలీసు స్టేషన్‌లో కేసు పెడతానంటూ వెళ్లిన క్రమంలో ఆ పరిసర ప్రాంతంలో రమేష్ పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# స్వచ్ఛతలో గుంటూరును అగ్రస్థానంలో నిలుపుదాం

**ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి**



స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి

నెహ్రూనగర్: చేయి చేయి కలుపుదాం.. స్వచ్ఛతలో గుంటూరును అగ్రస్థానంలో నిలుపుకుందామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి పిలుపునిచ్చారు. 32వ డివిజన్ కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దైవత్వానికి వెన్నంటే ఉండేది పరిశుభ్రమైన పరిసరాలేనని చెప్పారు. ఆరోగ్యమైన గుంటూరును ఆవిష్కరించాలంటే ప్రతి ఒక్కరూ సహకారాన్ని అందించాలన్నారు. శుభ్రత లేనిదే భద్రత లేదు.. మార్పు మనతో పాటు మన ఇల్లు, మన పరిసరాల నుంచే మొదలవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ బత్తుల దేవానంద్, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, ఎంహెచ్‌ఓ భానుప్రకాశ్, వివిధ డివిజన్ల అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# వక్ఫ్ ఆస్తులను పరిరక్షిస్తాం

లక్ష్మీపురం: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా బోర్డు కృషి చేస్తోందని రాష్ట్ర వక్ఫ్ బోర్డు చైర్మన్ ఖాదర్ బాషా పేర్కొన్నారు. తూర్పు నియోజకవర్గ పరిధిలోని పెద్ద మసీదును గురువారం ఆయన సిబ్బందితో కలసి తనిఖీ చేశారు. అనంతరం మసీదు ముతవల్లీలతో సమావేశమయ్యారు. సుదీర్ఘ కాలంగా పెద్ద మసీదుకు చెందిన అనేక ఎకరాల భూమి అన్యాక్రాంతం అవ్వడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ స్థలాల పరిరక్షణకు తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తోందని చెప్పారు. బోర్డు పరిధిలో ఉన్న ఎకరం భూమి కూడా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు. ఎంతో ఆదాయమున్న చారిత్రాత్మక పెద్ద మసీదు అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు అమలు చేస్తామని వెల్లడించారు. మసీదు భూముల్ని పరిరక్షిస్తామని తెలిపారు. రంజాన్ మాసానికి ముందే మసీదును పూర్తిగా మరమ్మతులు చేయించి సిద్ధం చేయాలని ముతవల్లీలను ఆదేశించారు.

# ఫిర్యాదులను పక్కాగా నమోదు చేయాలి

**సిబ్బందికి కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం**



కాల్ సెంటర్‌లో రిజిస్టర్ పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజల నుంచి స్థానిక సమస్యలపై అందే ఫిర్యాదులు పక్కాగా నమోదు చేసి, సంబంధిత అధికారులకు పంపాలని నగరపాలక సంస్థ కాల్ సెంటర్ సిబ్బందిని కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. ఆమె గురువారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కాల్ సెంటర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్‌లో నమోదు చేసిన ఫిర్యాదుదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ సమస్య పరిష్కారం అయ్యాక ఫిర్యాదుదారులకు సమాచారం ఇచ్చి క్లోజ్ చేయాలని సిబ్బందికి స్పష్టం చేశారు. నగరంలో ఇంకనూ తాగునీటి సమస్యపై ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయని, ఏఈల వారీగా తాగునీటి సరఫరాపై పిన్ పాయింట్ నివేదిక ఇవ్వాలని ఎస్ఈని ఆదేశించారు. స్థానిక సమస్యలపై నగర ప్రజలు అందుబాటులోని వార్డ్ సచివాలయంలో లేదా నగరపాలక సంస్థ కాల్ సెంటర్ 0863–2345103, 104, 105 నంబర్లకు లేదా 98499 08391కు వాట్సాప్ చేయవచ్చని ఆమె సూచించారు.

**విస్తరణ ప్రాంతాల్లో స్తంభాల్ని వెంటనే మార్చాలి**

నగరంలో రోడ్ల విస్తరణ చేస్తున్న ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాల్ని వెంటనే మార్చాలని ఆ శాఖ అధికారుల్ని నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశించారు. నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో గురువారం రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల్లో ఇతర శాఖల సమన్వయం, నాడు–నేడు పనులు, హౌసింగ్, తాగునీటి సరఫరా తదితర అంశాలపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ విస్తరణ పనులు జరిగిన ప్రాంతాల్లో డిమాండ్ చెల్లించినా పెద్ద పలకలూరు, కుగ్లర్ హాస్పిటల్ రోడ్డు, నందివెలుగు రోడ్డు తదితర ప్రాంతాల్లో స్తంభాలు షిఫ్ట్ చేయలేదన్నారు. రానున్న వారం రోజుల్లో పనులు పూర్తి చేయాలని సీపీడీసీఎల్ అధికారులకు స్పష్టం చేశారు. మరుగుదొడ్లు, ట్రాఫిక్ ఐలాండ్స్ మరమ్మతులు చేపట్టాలని, డివైడర్లకు పెయింటింగ్ చేయించాలని ఏఈలను ఆదేశించారు. యూజీడీ కార్మికులకు సేఫ్టీ కిట్స్, పారిశుధ్య కార్మికులకు యాప్రాన్స్, గ్లౌజుల పంపిణీకి చర్యలు తీసుకోవాలని ఎస్ఈని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఈ భాస్కర్, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మి, ఎంహెచ్‌ఓ డాక్టర్ భానుప్రకాష్, ఈఈలు సుందరరామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు, ఏపీసీపీడీసీఎల్ ఈఈ శ్రీనివాసబాబు, ఏడీహెచ్ రామారావు ఏఈలు పాల్గొన్నారు.

### అతిగా సెల్‌ఫోన్ వినియోగంతో అనర్థమే ఎక్కువ



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీఓ కృష్ణవేణి

గుంటూరు మెడికల్: సెల్‌ఫోన్లు అవసరమైనంత వరకే ఉపయోగించుకోవాలని, గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో పరిచయాలు మంచివి కావని గుంటూరు అర్బన్ సీడీపీఓ టి.కృష్ణవేణి సూచించారు. పలకలూరు రోడ్డులోని కేఎస్ఆర్ నర్సింగ్ కాలేజీలో విద్యార్థినులకు మహిళా చట్టాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కృష్ణవేణి మాట్లాడుతూ చదువుకునే వయస్సులో నిర్దేశిత లక్ష్యాన్ని పెట్టుకుని దాని సాధనకు కృషి చేయాలని సూచించారు. దిశ సెంటర్ లాయర్ ఎ.విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళ చట్టాల గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. సైబర్ క్రైం, సైబర్ మోసగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ మోసగాళ్లు వల వేసి మోసం చేసే విధానాలను విద్యార్థినులకు వివరించారు. కాలేజీ డైరెక్టర్ కావూరి విజయ్‌చంద్ మాట్లాడుతూ నర్సింగ్ కోర్సు చదవడం విద్యార్థినులకు ఎంతో ఉపయోగకరమని చెప్పారు. పూర్తయిన వెంటనే దేశ, విదేశాల్లో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. క్రమశిక్షణతో నర్సింగ్ విద్యనభ్యసించాలని సూచించారు. రోగులపై జాలి, దయ, కరుణ కలిగి ఉండాలని తెలిపారు. సదస్సు అనంతరం హాస్టల్ గదులు, భోజనశాలను సీడీపీఓ కృష్ణవేణి, విజయలక్ష్మి తనిఖీ చేశారు. సౌకర్యాల గురించి విద్యార్థినుల్ని అడిగి తెలుసుకున్నారు.

### వాణిజ్య పన్నుల శాఖ ఉద్యోగులకు మెమోలు

పాత గుంటూరు: గుంటూరు డివిజన్ పరిధిలోని 13 మంది ఉద్యోగులకు జాయింట్ కమిషనర్ కె. మధుబాబు గురువారం చార్జి మెమోలు గురువారం జారీ చేశారు. గత ఏడాది డిసెంబర్‌లో తాడేపల్లిలో శాఖ ప్రధాన కార్యాలయంలో అదనపు కమిషనర్ కృష్ణమోహన్‌రెడ్డి బదిలీలపై విచారణ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న తరుణంలో ఉద్యోగులు నిబంధనలకు వ్యతిరేకంగా ఆయన చాంబర్‌లో నిరసన వ్యక్తం చేసి విధులకు ఆటంకం కలిగించారు. దీన్ని సీరియస్‌గా పరిగణించిన ఆర్థిక శాఖ, వాణిజ్య పన్నుల కార్యదర్శి గుల్జార్ ఆదేశాల మేరకు శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు.

### రైల్వే మహిళా అధికారులకు డీఆర్ఎం సత్కారం




బహుమతులను అందజేస్తున్న డీఆర్ఎం రామకృష్ణ, పక్కన ఏడీఆర్ఎం శ్రీనివాస్

లక్ష్మీపురం: స్త్రీ సమాజానికి మూల స్తంభమని, సమాజాభివృద్ధిలో మహిళలు కీలకపాత్ర పోషిస్తారని గుంటూరు డీఆర్ఎం ఎం.రామకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని తన కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సమాజం మహిళలకు అనేక అవకాశాలను కల్పిస్తోందని, వారు అన్ని రంగాలలో తమ సామర్థ్యాలను నిరూపించుకున్నారన్నారు. మంచి సమాజంగా అభివృద్ధి చెందటానికి చిన్నారులను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో తల్లిపాత్ర అమోఘమన్నారు. సమావేశంలో రైల్వే మహిళా అధికారులు సీనియర్ డీఈఎన్ కో–ఆర్డినేషన్ జె.వి. అనుషా, క్రీడా అధికారి గీతా తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో ఏడీఆర్ఎం (ఆపరేషన్స్) రామ్‌మెహర్, ఏడీఆర్ఎం శ్రీనివాస్, సీనియర్ డీసీఎం, డివిజన్ అధికారులు పాల్గొని మహిళా అధికారులను ఘనంగా సత్కరించారు.



**కోల్‌కతాలోని డెట్స్ రికవరీ అప్పీలేట్ ట్రిబ్యునల్ సమక్షంలో**
**9, ఓల్డ్ పోస్ట్ ఆఫీస్ స్ట్రీట్, 7వ అంతస్తు, కోల్‌కతా - 700001**

**అప్పీల్ నం.38 ఆఫ్ 2020**
**(S.A. no. 254 ఆఫ్ 2018 వలన వచ్చినది)**

M/s శ్రీ సాయి [illegible] ... అప్పీలు దారులు

వర్సెస్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు ఇతరులు ... ప్రతివాదులు

2. శ్రీ [illegible] S.J.A [illegible], D.no.6-13-70, అరండల్‌పేట్ 13/2, గుంటూరు-522002 ... ప్రతివాది నం.2

**సమన్లు**

[illegible] S.A.no 254 ఆఫ్ 2018లో 31.08.2018 [illegible] 2002 లోని సెక్షన్ 18 [illegible] 18.04.2023 [illegible] 10.30 [illegible] 08 [illegible] 2023 [illegible]

సం/- రిజిస్ట్రార్, డెట్స్ రికవరీ అప్పిల్లేట్ ట్రిబ్యునల్, కోల్‌కతా